# ప్రేమ పురాణం

-దీవి లక్ష్మీరాజేశ్వరి

(గత సంచిక తరువాయి)

## ఒకప్పుడు అతనికి కలలుండేవి.

## ఒకప్పుడు అతనికి కాంక్షలుండేవి.

### ఒకప్పుడు అతనికి ఆకాంక్షలుండేవి.

### ఒకప్పుడు అతనికి ఆశలుండేవి.

ఒకప్పుడు అతని ఆత్మా, శరీరం ఒక్క లయకు స్పందించేది – ఆమె కోసం!

ఒకప్పుడు ఆమెను శాశ్వతం చేసుకోవాలని కలలు కన్నాడు.

విధి వక్రించింది.

విధి తనని వెక్కిరించింది.

విధి తనతో చెలగాటం ఆడింది.

విధి తనని పరిహసించింది.

తన ప్రేయసి, తన సర్వస్వం అయిన నీలోఫర్ ఈనాడు తన యజమాని అయిన సులేమాన్ భార్య! పిచ్చెక్కి ఆసుపత్రిలో రోదిస్తోంది!!

మళ్ళీ చిత్రపటంకేసి చూశాడు సంజయ్.

అదే రూపం!

అదే అందం!!

అదే అమాయకత్వం!!!

ఈ మరుభూమిలో ఆమె ఒంటరిగా ఇంకా తనకోసమే నిరీక్షిస్తున్నట్టు అనిపించింది సంజయ్‌కి.

నీలోఫర్‌ని కలుసుకున్న క్షణాలు గుర్తుకువచ్చాయి అతనికి.

ఆ సంఘటన ఇలాంటిదే ఒక భవంతిలో అంతకుముందురోజే జరిగినట్టు అనిపించింది అతనికి.

హైదరాబాద్ నగరానికి దూరంగా వున్న ఒక కొండచరియ. పక్కనే ఒక పురాతన భవనం. నీలోఫర్, సంజయ్ నగరాన్ని తిలకిస్తున్నారు.

ఆకాశం ఎర్రబడి వుంది.

గాలి వేగంగా వీస్తోంది.

నీలోఫర్ హృదయం ఆందోళనపడసాగింది.

ఆమెకు ముచ్చెమటలు పోస్తున్నాయి.

ఆమె సంజయ్ చేతిని గట్టిగా పట్టుకొంది.

'సంజయ్, ఇక వెళిపోదాం!' అంది నీలోఫర్ వున్నట్టుండి.



'ఎందుకు?'

'నగరాన్ని ఏదో కబళించేట్టుగా వుంది!'

'కానీ నా ప్రేయసి మాత్రం పూర్తిగా నా బాహువుల్లో సురక్షితంగా వుంది'

అంటూ సంజయ్ ఆమెను తన కౌగిట్లోకి తీసుకున్నాడు

ఆమె వణికిపోతోంది.

సంజయ్ కౌగిట్లోంచి 'మా నాన్న నాకోసం ఎదురుచూస్తుంటారు' ఆమె గద్గదిక స్వరంతో అంది.

'నేను ప్రతరోజూ చూపుల్ని నీకోసం పరచి వుంచుతున్నాను ఒకరోజు ఆయన్ని కూడా నిరీక్షించనీ.'

'వద్దు. ఈ తుఫాను వాతావరణంలో ఆయన భయపడతారు. నాకోసం ఆయన [illegible] పరితపిస్తుంది.'

'నువ్వు వెళ్ళిపోతే మరి [illegible]'

'నీ పరితాపం తగ్గిపో[illegible]

'ఎప్పుడు?'

'మా నాన్న అమ్మను ఒప్పించిన మరుక్షణం!'

'మీ అమ్మ ఎన్నటికీ అంగీకరించదు.'

'ఎందుకని?'

'ఆమె నీకు సవతితల్లి! అదీగాక హృదయం లేని మనిషి'

'కానీ మా నాన్న చాలా గొప్పవారు. ఆయన మనసు చాలా విశాలమైంది. బిడ్డ సుఖం కోసం దేన్నయినా అర్పించగల త్యాగగుణం ఆయనలో వుంది.'

'కానీ ప్రస్తుతం ఆయన నీ సవతితల్లి గుప్పెట్లో వున్నారు. కేవలం ఆమె చేతిలో కీలుబొమ్మ!'

ఆ నిజాన్ని కాదనలేకపోయిది నీలోఫర్. ఉదాసీనంగా మారిపోయింది ఆమె ముఖం. కోపంతో తిరిగి ఎర్రబడసాగింది.

సంజయ్ ఆమె చిబుకాన్ని పట్టుకుని తల పైకెత్తాడు.

'కోపంలో నువ్వు ఎంత అందంగా వుంటావ్!'

'ప్రేమలో నువ్వు అంత అసహనశీలివవుతావు.'

ఇద్దరూ హాయిగా నవ్వుకున్నారు.

'కానీ నీలూ! సహనం అనేది ప్రేమ పాలిట మృత్యువుతో సమానం. నేను మాత్రం రోమియో- జూలియట్, లైలా-మజ్నూ, షీరీ-ఫర్హాద్, హీర్-రాంఝాల కథల్ని తిరిగి పునరావృత్తం చేయదలచుకోవడం లేదు.'

'దేవుడు పవిత్ర ప్రేమల్ని పరీక్షకు పెడతాడంటారు.' అంటూనే నీలోఫర్‌కేసి పరీక్షగా చూస్తూన్న సంజయ్ నుద్దేశించి 'అవును. నిజం సంజయ్!' అంది.

'అయితే నేను మాత్రం తప్పనిసరిగా ఆ పరీక్షలో ఉత్తీర్ణుడనవుతాను' చిలిపిగా చెప్పాడు సంజయ్ సమాధానం.

'ఎలా?'

'ప్రేమలో విజయం సాధించిన ఎవరో ఒక ప్రియుణ్ణి అనుకరిస్తాను.'

పగలబడి నవ్వింది నీలోఫర్.

అలా నవ్వుతూనే వెళ్ళిపోయింది.

ఆమె నవ్వుల గలగలలు గుడిగంటల్లా మోగాయి.

ఇప్పటికీ మోగుతూనే వున్నాయి.

ఆ శబ్దం, ఆ నవ్వుల శబ్దం, ఆ గుడిగంటల శబ్దం – అలా పెరుగుతూ పోయింది.

క్షణక్షణం పెరిగిపోతూన్న ఆ గణగణ గంటల శబ్దం సంజయ్‌ని పిచ్చివాణ్ణి చేసింది.

'నీలూ! పిచ్చిదానివైపోయావా?!' సంజయ్ గొంతులోంచి వూడిపడ్డ మాటలివి.

గది మొత్తం నిశ్శబ్దం అలముకుంది.

నీలోఫర్ నవ్వుతోపాటు నీలోఫర్ కూడా మాయమైపోయింది.

నీలోఫర్ చిత్రపటం ముందు నిల్చుని వున్న తన శరీరం తడిచి ముద్దయిందనీ, తనకు సమీపంలోనే ఎవరో నిలబడి ఏదో అంటున్నారనీ తెలిసి వచ్చింది, వున్నట్టుండి సంజయ్‌కి.

'ఎవరు సార్ పిచ్చిదయింది?' లఖన్‌సింగ్ అడుగుతున్నాడు.

సంజయ్ అతని ప్రశ్నకి నిలువునా కదిలిపోయాడు. తన తప్పు తనకి తెలిసి వచ్చింది. అపరాధ భావనతో తలవంచుకున్నాడు ... కొద్ది క్షణాల అనంతరం మెల్లగా తలఎత్తి లఖన్‌సింగ్‌కేసి చూశాడు. అతని ముఖం నిండా ప్రశ్నలే.

'అనుమతి లేకుండా యజమాని భార్య గదిలోకి అడుగుపెట్టడం పిచ్చితనం గాక మరేమిటి?' కంగారుగా చెప్పేసి, గదిలోంచి బయటికి అడుగు పెట్టాడు సంజయ్.

సంజయ్ వ్యవహారం కొంత వింతగా కనిపించినప్పటికీ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోలేదు లఖన్‌సింగ్. అతని వెనుకనే నడుస్తూ 'సార్' అని పిలిచాడు.

వెనక్కి తిరిగి ఏమిటన్నట్టుగా చూశాడు సంజయ్.

'భోజనం చేసేస్తారా?'

'స్నానం తర్వాత!'

'మీ సామాను మొత్తం గెస్ట్‌రూములో పెట్టేశాను. మీ స్నానానికి కూడా అన్నీ సిద్ధం చేశాను.'

'దావూద్ ఎక్కడికి వెళ్ళాడు?'

'ప్రార్థనకి వెళ్ళాడు సార్!'

సందేహాభరితంగా వున్న లఖన్‌సింగ్ చూపుల్ని గమనించి అతనితో అధికంగా మాట్లాడటం ప్రస్తుతం సమంజసం కాదనిపించి అతనివెంట గెస్ట్‌రూమ్‌కేసి అడుగులు వేయసాగాడు సంజయ్.

భోజనం ముగించేసరికి రాత్రి పదిఅయింది. హాల్లో కేవలం మసక వెలుతురు మాత్రమే వుంది. తలుపులు, కిటికీలు తిరిగి మూసివేశారు.

పశు పక్ష్యాదుల ప్రమాదం లేకుండా లఖన్‌సింగ్ అన్ని జాగ్రత్తలూ తీసుకున్నాడు.

'భోజనం ఎలావుంది సార్?' భయపడుతూ అడిగాడు లఖన్‌సింగ్.

'అద్భుతంగా వుంది!'

'మీకు నచ్చుతుందని అనుకున్నాను సార్! ఇండియన్స్‌కీ, మరీ ముఖ్యంగా హైదరాబాద్ వాళ్ళకు బాగా నచ్చే వంటకం సార్! కారం, మసాలా కాస్తంత ఎక్కువ పడాలి వాళ్ళకి'

'నీకెలా తెలిసింది?'

'బేగం నీలోఫర్‌కి అలా చేస్తేనే నచ్చేది.'

నీలోఫర్ పేరు మరోసారి సంజయ్ హృదయాన్ని కెలికింది. అందుకే అతను ఉద్దేశ్యపూర్వకంగా సంభాషణని వేరే అంశం మీదికి మళ్ళించాడు.

'లఖన్‌సింగ్ మీది ఏప్రాంతం?'

'లక్నో సార్!'

'అదా సంగతి!'

'అవును సార్!'

'అక్కడ ఏం చేసేవాడివి?'

'కంపోజిటర్‌గా పనిచేసేవాణ్ణి'

'అంత గౌరవప్రదమైన వృత్తిని మానేసి ఈ వాచ్‌మేన్ ఉద్యోగం కోసం ఎందుకు వచ్చావ్?'

'డబ్బుకోసం!'

లఖన్‌సింగ్ సమాధానం సంజయ్ మస్తిష్కాన్నీ, అంతరాత్మనీ మరోసారి కుదిపేసింది. వాస్తవానికి ఉలిక్కిపడ్డాడు సంజయ్. వెంటనే తేరుకుని లఖన్‌సింగ్‌కేసి చూశాడు. లఖన్‌సింగ్ డైనింగ్ టేబుల్‌మీది పాత్రల్ని సర్దుతూ కనిపించాడు.

'అవును సార్! కేవలం డబ్బుకోసం మనిషి అనేకసార్లు అంతరాత్మను సయితం చంపుకోవలసి వస్తుంది. వుట్టి పెరిగిన ప్రదేశాన్నీ, అయినవాళ్ళనీ అందరినీ వదులుకొని ఈ దేశం కాని దేశంలో, ఈ వడగాడ్పుల మధ్య బతుకు వెళ్ళదీస్తున్నాను. నాదాకా ఎందుకు? మీరు మాత్రం స్వంతవాళ్ళనీ, స్వదేశాన్నీ వదిలిపెట్టి ఆనందంగా ఇక్కడికి వచ్చారా?'

లఖన్‌సింగ్ ప్రశ్నకి సంజయ్ ఏం సమాధానం చెప్పలేదు. ఏష్‌ట్రే మీద సగం వరకు కాలిన సిగరెట్టు అందుకుని గట్టిగా రెండు దమ్ములు పీల్చాడు.

లఖన్‌సింగ్ చెప్పింది ముమ్మాటికీ నిజం. కేవలం డబ్బు కోసమే తాను ఈ ఎడారి దేశానికి వచ్చానని అనుకున్నాడు సంజయ్ మనసులో.

ఉన్నట్టుండి నీలోఫర్ మళ్ళీ మదిలో మెదిలింది. ఆమెకూడా తన ప్రేమనీ, కాంక్షనీ, కలల్నీ ఈ డబ్బు కిందనే సమాధి చేసింది.

ఈ ఆలోచన రావటంతో శరీరం ఒక్కసారిగా జలదరించినట్లయింది సంజయ్‌కి.

సంజయ్ స్మృతి పథంలోకి గతం తొంగిచూసింది.

(సశేషం)